ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -40 పేజీలు - 8 వెల - 03/- మంగళవారం 26 మే 2026



# రతన్ టాటా హబ్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం

## విజయవాడ ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ లో చంద్రబాబు

**రతన్ టాటా హబ్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహంద -వంద యూనికార్న్ సంస్థల ఏర్పాటు లక్ష్యం**

**విలేజ్ టూ గ్లోబల్ మా ప్రభుత్వ నినాదం -దేశ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలలే ఊతం**



**అమరావతి, మే 25 (రిపబ్లిక్ న్యూస్):**
:రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీ నుంచి వంద యునికార్న్ సంస్థలు ఏర్పాటు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. వచ్చేది నాలెడ్జ్ ఎకానమీ అని.. దీనిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది తమ ప్రభుత్వ నినాదమని ఉద్ఘాటించారు. ఒక పరిశ్రమ వ్యర్థాలు.. మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుందని వివరించారు. సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థ, ఎంఎస్ఎంఈ ఎకో సిస్టమ్ **మిగతా 2లో...**

# అట్టహాసంగా పద్మ పురస్కారాలు

**పలువురికి అవార్డులు అందచేసిన రాష్ట్రపతి**

**కార్యక్రమంలో ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు**

2లో.



# 'ఇంకా పాఠాలు నేర్చుకోలేదు'..

**నీట్ పేపర్ లీక్‌లపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం!**



2లో.



# హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట..

**రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్!**

హైదరాబాద్ **మే 25 (రిపబ్లిక్ న్యూస్):**
హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చేలా కీలక ఒప్పందం కుదిరింది. రూ.13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేయడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఢిల్లీలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు అధికారికంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సమక్షంలో ఈ డీల్ ఖరారైంది. **మిగతా 2లో...**

# పార్టీ ప్రక్షాళనకు పక్కా ప్రణాళిక

**రాజమండ్రిలో జనసేన క్యాడర్ తో పవన్ సమావేశం**

**ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలపై స్పందన**

**పార్టీలో అంతర్గత కుమ్ములాటలపై ఆగ్రహం**

**ఇక ఉపేక్షించేది లేదని స్పష్టీకరణ**

**రాజమండ్రి మే 25 (రిపబ్లిక్ న్యూస్):**
రాజమండ్రిలో పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సుదీర్ఘంగా, ఆవేశంగా ప్రసంగించారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది పదవుల కోసం కాదని, ప్రజలకు సేవ చేసేందుకేనని పునరుద్ఘాటించారు. **మిగతా 2లో...**



# గోదావరి పుష్కరాలపై రాజమండ్రిలో పవన్ సమీక్ష

**గోదావరి పుష్కరాలకు 10కోట్ల మంది**

**అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు ఉండాలి**

**రాజమహేంద్రిలో అధికారులతో పవన్ సమీక్ష**

2లో.



# నారా లోకేష్ ను పదవి నుంచి తొలగించండి

**ప్రభుత్వం నిర్వహించింది మెగా డీఎస్సీనా లేక మోసం చేసిన డీఎస్సీనా అని జగన్ ప్రశ్న**

**డేటీ లీక్ చేసి, మెరిట్ లిస్టులను మాయం చేస్తూ ద్రోహం చేశారని మండిపాటు**

**అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంకు ఎలా వచ్చిందో చెప్పాలని డిమాండ్**



2లో.

# నాలుగోసారి పెరిగిన పెట్రో ధరలు

**పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు**



**న్యూఢిల్లీ మే 25 (రిపబ్లిక్ న్యూస్):**
దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తాజా ధరల సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంచినట్లు వెల్లడించాయి. ఈ సవరించిన ధరలు సోమవారం **మిగతా 2లో...**

# ధాన్యం సేకరణలో సహకరించని కేంద్రం

**ఈ యేడు మొక్కజొన్న అధికంగా దిగుబడి**

**సిపిఐ బృందంతో సిఎం రేవంత్ వెల్లడి**

హైదరాబాద్, **మే 25 (రిపబ్లిక్ న్యూస్):**
కేంద్రప్రభుత్వం సహకరించకపోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో సీపీఐ బృందం సోమవారం సచివాలయంలో సమావేశం అయ్యింది. సీఎంని కలిసిన వారిలో **మిగతా 2లో...**



# 16 వేల మంది టీచర్లను జగన్ అవమానిస్తున్నారు

**జగన్ ను టార్గెట్ చేసిన మంత్రి లోకేష్**

**ఎంపికైన అభ్యర్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**త్వరలోనే మరో డీఎస్సీ ఇస్తామని వెల్లడి**

**ఉద్యోగాలను అడ్డుకుంటూ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆరోపణ**

**అమరావతి, మే 25 (రిపబ్లిక్ న్యూస్):**
మెగా డీఎస్సీపై వ్యాఖ్యలు చేసిన మాజీ సీఎం జగన్ పై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లను జగన్ అవమానిస్తున్నారని, వారికి లెంపలు వేసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. **మిగతా 2లో...**



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# రతన్ టాటా హబ్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం

**మొదటిపేజీ తరువాయి**

తయారు కావాలని ఆకాంక్షించారు. సోమవారం విజయవాడలో ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ - 2026 జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) వెన్నెముక అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ రంగం యువత కలలకు వేదికని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్‌లో స్టాళ్లను సందర్శించి, స్టార్టప్ సంస్థలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం 38 పారిశ్రామిక పార్కులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం తర్వాత ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తున్న రంగం ఎంఎస్ఎంఈ అని అన్నారు. మహిళా ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేసేది ఎంఎస్ఎంఈలే. ఇవి సరికొత్త ఆలోచనలకు వేదిక కావాలి. ఈ వేదిక ద్వారా అనేక ఒప్పందాలకు శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో కోటి ఎంఎస్ఎంఈలు ప్రారంభం కావాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాం. 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో 550 ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు వస్తున్నాయి. ఇవి సరికొత్త ఆలోచనలకు వేదికలు




కావాలని చంద్రబాబు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరిట ఓ కళావేదికను ఇవాళ ప్రారంభించు కుని ఎంఎస్ఎంఈ సమ్మిట్ - 2026 నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 4.4 ఎకరాల్లో 1.45 చదరపు అడుగుల స్థలంలో ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మించామని తెలిపారు. ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తున్న రంగం ఇదేనని చెప్పుకొచ్చారు. ఏపీలో వనరులు వినియోగిం చుకునేలా ఎంఎస్ఎంఈలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఎంఎస్ఎంఈ పాలసీతో పాటు ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తీసుకువచ్చామని సీఎం పేర్కొన్నారు. ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్‌లు, పారిశ్రామిక యూనిట్‌లు, నిపుణులు, బ్యాంకులు ఒకే వేదికపైకి వచ్చాయని వివరించారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్‌లు ఏర్పాటు కావాలని సూచించారు. రూ.500 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలు కూడా ఇప్పటికే విడుదల చేశామని చెప్పుకొచ్చారు. రూ.200 కోట్లతో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కూడా ప్రారంభిస్తున్నామని వివరించారు. ప్రతీ నియోజక వర్గంలో ఒక ఏంఎస్ఎంఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇవాళ శంకుస్థాపన చేసిన 38 పార్కులతో పాటు వందపార్కులకు ఇప్పటికే శంకుస్థాపన చేశామని ప్రస్తావించారు. ఎలాంటి వివాదాలు లేకుండా ఈ పారిశ్రామిక పార్కులకు భూములు ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు పారిశ్రామిక పార్కులకు కూడా ఇన్సెంటివ్స్ ఇస్తామని స్పష్టం చేశారు. శ్రీసిటీ విజయవంతమైన పారిశ్రామిక
పార్క్ అని చెప్పుకొచ్చారు. రూ.28 వేల కోట్ల కార్పస్ ఫండ్ డ్వాక్రా మహిళల సంఘాల వద్ద ఉందని తెలిపారు. ఈ ఏడాది 5 లక్షల మంది డ్వాక్రా సంఘాల మహిళలను ఎంటర్ ప్రెన్యూర్లుగా మారుస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు టిజి భరత్, డోలా బాలవీరాంజనేయ స్వామి, శ్రీనివాస్, ఎంపి కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలపై పవన్ సమీక్ష

**రాజమండ్రి, మే 25 (రిపబ్లిక్ న్యూస్):**



రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన 2027 గోదావరి పుష్కరాల సన్నద్ధత సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకకు ఇప్పటివరకు సరైన సన్నద్ధత కనిపించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.8,600 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన పనులకు ఇప్పటికీ డీపీఆర్‌లు సిద్ధం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కాగితాలపై ప్రణాళికలు కాకుండా క్షేత్ర స్థాయిలో పనులు కనిపించాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో సీఎం చంద్రబాబుకు వివరించాలని అధికారులను ఆదేశించారు.సరైన ప్రణాళిక లేకుండా ఒకే ఏడాదిలో 7 వేల పనులు హడావుడిగా చేస్తే నాణ్యత దెబ్బతింటుందని పవన్ హెచ్చరించారు. "పాడైపోయిన సిమెంట్‌తో పనులు చేసి ప్రమాదాలు జరిగితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది, స్పష్టమైన డేటా లేకుండా అడిగితే కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వదు" అని స్పష్టం చేశారు. గత పుష్కరాల తొక్కిసలాట ఘటనలు పునరావృతం కాకుండా, ఆరు జిల్లాల్లోని 274 పంచాయతీల వరకు ఏర్పాట్లు విస్తరించాలని, గోదావరి కాలుష్య నివారణకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ అంశాన్ని త్వరలోనే కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, పుష్కరాల నిధుల సమీకరణలో పవన్ కల్యాణ్ ఆశాకిరణంలా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ధాన్యం సేకరణలో సహకరించని కేంద్రం

**మొదటిపేజీ తరువాయి**

సీపీఐ ఎమ్మెల్సీ సత్యం, పశ్య పద్మ , ఈ.నరసింహ, చాడ వెంకట్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే భాగం హేమంతరావు, శంకర్, బాల నరసింహ, వీఎస్ బోసు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు. కార్మికులకు కనీస వేతనాల పెంపుపై ముఖ్యమంత్రికి సీపీఐ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎంతో సీపీఐ నేతలు చర్చించారు. ధాన్యం సేకరణ, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులతో సీఎం మాట్లాడారు. కేంద్రప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లు చేయడం లేదని తెలిపారు. తమ ప్రభుత్వానికి నష్టం వచ్చినా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# నారా లోకేష్ ను పదవి నుంచి తొలగించండి

**ప్రభుత్వం నిర్వహించింది మెగా డీఎస్సీనా లేక మోసం చేసిన డీఎస్సీనా అని జగన్ ప్రశ్న**

**అమరావతి, మే 25 (రిపబ్లిక్ న్యూస్):**
ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించింది మెగా డీఎస్సీనా లేక నిరుద్యోగులను మోసం చేసిన దగా డీఎస్సీనా అని వైసీపీ అధినేత జగన్ నిలదీశారు. తమ హయాంలో ఇచ్చిన డీఎస్సీని రద్దు చేసి, కావాలనే ఆలస్యం చేస్తూ కొత్త నోటిఫికేషన్‌తో పబ్లిసిటీ చేసుకున్నారని విమర్శించారు. తీరా చూస్తే పేపర్లు లీక్ చేసి, డేటా డిలీట్ చేసి, మెరిట్ లిస్టులను మాయం చేస్తూ అభ్యర్థులకు పెద్ద ద్రోహం చేశారని మండిపడ్డారు. ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని, ఈ లీకులపై సీబీఐ చేత విచారణ జరిపించాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.పరీక్ష నిర్వహణలో చురుగ్గా పాల్గొన్న ఒక ఎస్ సీఈఆర్టీ (రాజజు=ు) అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంకు ఎలా వచ్చిందో సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఆ తర్వాత ఆ వివరాలను డేటాబేస్ నుంచి ఎందుకు డిలీట్ చేశారో, మెరిట్ లిస్టులను ఎందుకు దాచారో, టాపర్ వివరాలను ఎందుకు తొలగించారో స్పష్టం చేయాలన్నారు. కేవలం సెలెక్ట్ అయిన వారికి మాత్రమే నేరుగా మెసేజ్‌లు పంపి, కలెక్టర్ ఆఫీసుల్లో సెలక్షన్ లిస్టులు పెట్టకపోవడం వెనుక పెద్ద మతలబు ఉందన్నారు. డీఎస్సీలో 'స్పోర్ట్స్ కోటా' పోస్టులను ఒక్కొక్కటి రూ.15 లక్షలకు అధికార పార్టీ నాయకుడే ఇంటికి పిలిచి బేరసారాలు సాగించారని ఆరోపించారు. క్రీడా మైదానంలో అడుగుపెట్టని వారికి కూడా ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చి ఉద్యోగాలు అమ్ముకున్నారని, ఇది రిక్రూట్‌మెంటా లేక వేలం పాటా అని ధ్వజమెత్తారు. టెట్ కన్వీనర్‌గా ఉన్న అధికారే డీఎస్సీ పరీక్షకూ కన్వీనర్‌గా ఉన్నప్పటికీ... ఉన్నపళంగా ఆయన్ను తొలగించి జాయింట్ డైరెక్టర్‌ను కన్వీనర్‌గా ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ మెగా అవినీతిపై చంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే లోకేష్‌ను పదవి నుంచి తప్పించి, సీబీఐ దర్యాప్తు కోరి ప్రతిభ గల అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# పార్టీ ప్రక్షాళనకు పక్కా ప్రణాళిక

**మొదటిపేజీ తరువాయి**

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కరెంట్, రోడ్లు లేని మారుమూల గ్రామానికి ఆ సౌకర్యాలు కల్పించినప్పుడు కలిగే సంతృప్తి, ఆస్కార్ అవార్డు కంటే గొప్పదని అన్నారు. డోలీ మోతలతో ప్రాణాలు కోల్పోతున్న గిరిజనులకు రోడ్డు వేయగలిగితే అది ప్రపంచ స్థాయి గుర్తింపు కంటే ఎక్కువ తృప్తినిస్తుందన్నారు.

"భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి త్యాగధనుల స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చాను. వారికి ఏ పదవులు ఉన్నాయి? దేశం కోసం వారు చేసిన త్యాగమే వారిని ప్రజల గుండెల్లో నిలిపింది. అలాంటి స్ఫూర్తితోనే నేను పనిచేస్తున్నాను" అని పవన్ వ్యాఖ్యానించారు.

**ఆ రాజకీయ విశ్లేషకుడు అంటే నాకు గౌరవం ఉంది.. కానీ..!**

ఇటీవల రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలపై పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుకుంటున్నప్పుడు వైసీపీ నాయకుడిని (జగన్ ను) అరెస్ట్ చేయాలని కోరినట్లు, దానికి అమిత్ షా తనపై క్లాస్ తీసుకున్నట్లు ఆ విశ్లేషకుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

"ఆ రాజకీయ విశ్లేషకుడు అంటే నాకు గౌరవం ఉంది. కానీ విశ్లేషణ వేరు, వదంతులు వేరు. విశ్లేషకులు వాస్తవాల ఆధారంగా మాట్లాడాలి తప్ప, ఎవరో చెప్పారని విని మాట్లాడకూడదు. సర్దార్ పటేల్ తర్వాత అంతటి దృఢమైన హోంమంత్రి అమిత్ షా. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న వ్యక్తి ఆయన. అలాంటి వ్యక్తి గురించి తేలికగా మాట్లాడటం సరికాదు. ఒకవేళ నేరం జరిగితే చట్టం తనపని తాను



చేసుకుపోతుంది. కోర్టులు, వ్యవస్థలు ఉన్నాయి. వాళ్లను జైల్లో పెట్టండి, వీళ్లను బయటకు తీయండి అని చెప్పడానికి నేనెవడిని? అలాంటి మాటలు మాట్లాడటం వ్యవస్థను అవమానించడమే. అయినా అదేం లాజిక్కో నాకు అర్థం కావడం లేదు. జగన్ ను జైల్లో పెడితే నేను సీఎం అవుతానా?" అని పవన్ మండిపడ్డారు.

**లసహనానికి కాలం చెల్లింది.. ఇక నేనేంటో చూపిస్తా!**

గడిచిన 12 ఏళ్లుగా ఎన్నో అవమానాలు, విమర్శలు భరించానని, పార్టీ శ్రేణుల కోసం ఎంతో సహనంగా ఉన్నానని, కానీ ఇకపై ఆ సహనం ఉండదని పవన్ తేల్చిచెప్పారు. "నా మౌనాన్ని బలహీనతగా తీసుకోవద్దు. భరించాను, సహించాను, అవసరమైతే తాట తీస్తానని గతంలోనే చెప్పాను. అది సినిమా డైలాగ్ కాదు, నాలోని సగటు మనిషి ఆవేదన. ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే, దాడి చేస్తే నవ్వుతూ భరించడానికి నేను సిద్ధంగా లేను. ప్రతి చర్యకు ప్రతిచర్య ఉంటుంది. ఇకపై పరిణామాలు తీవ్రంగా ఉంటాయి" అని గట్టిగా హెచ్చరించారు.

**పార్టీ ప్రక్షాళనకు పక్కా ప్రణాళిక.. ఆగస్టు 14 డెడ్‌లైన్**

పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు పవన్ ప్రకటించారు. "రాబోయే రోజుల్లో 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు ప్రత్యేక కమిటీలను పంపుతున్నాను. వీరు నాయకులను ఎంపిక చేయరు, క్షేత్రస్థాయిలో పనిచేసిన నిజమైన కార్యకర్తలు, సాధక్స్‌ను గుర్తిస్తారు. ప్రతి నియోజకవర్గంలో పనిచేసే వారి జాబితాను సిద్ధం చేస్తారు. నా లక్ష్యం ఒక్కటే.. ఆగస్టు 14 స్వాతంత్ర్య దినోత్సవం నాటికి రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో మన పార్టీ కార్యవర్గం జెండా ఎగురవేయాలి. అంత పటిష్ఠంగా పార్టీని నిర్మించబోతున్నాను. వ్యూహం నేను రచిస్తాను, మీరు ఆచరించండి. ఇకపై నన్ను ప్రశ్నించవద్దు. సేనానిగా నేను చెప్పింది వినండి" అని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

**శత్రువు బలంగా ఉన్నప్పుడే కొడతా.. అది నా నైజం**

తన రాజకీయ నైతికతను వివరిస్తూ, శత్రువు బలహీనంగా ఉన్నప్పుడు దాడి చేయడం తన నైజం కాదని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. "ఒకరు జైల్లో ఉన్నప్పుడు మనం బలపడదామని నేను అనుకోను. అదే నిజమైతే చంద్రబాబు గారు జైల్లో ఉన్నప్పుడు నేను ముఖ్యమంత్రి అయిపోవచ్చని అనుకోవాలి కదా! నా విలువలు అలాంటివి కావు. శత్రువు బలంగా ఉన్నప్పుడే నేను పోరాడతాను, బలంగానే కొడతాను. అంతేగానీ, బలహీనంగా ఉన్నప్పుడు దెబ్బతీయను. అందరూ ఆరోగ్యంగా, బలంగా ఉండండి, అప్పుడు తలపడదాం. నీ సామర్థ్యం ఎంత వరకు ఉందో అంత యుద్ధం చేస్తాను... అది ఆ నైజం" అని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, జనసేన బలాన్ని బలంగా ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.

# నాలుగోసారి పెరిగిన పెట్రో ధరలు

**మొదటిపేజీ తరువాయి**

నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా గత పది రోజుల వ్యవధిలో ఇది నాలుగోసారి ఇంధన ధరలు పెరగడం గమనించదగ్గ విషయం. వరుస ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ తాజా పెంపు మరింత భారంగా మారింది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు సుమారు రూ.8 వరకు పెరిగినట్లు అంచనా. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ రూ.103.74గా నమోదవగా, విజయవాడలో పెట్రోల్ ధర రూ.117.19, డీజిల్ రూ.104.88కు పెరిగింది. ఇంధన ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదలని నిపుణులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరాపై నెలకొన్న అనిశ్చితి కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు ఎగబాకుతున్నాయి. ఈ ప్రభావాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు నేరుగా వినియోగదారులపై మోపుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా రవాణా ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలపై కూడా పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారితే భవిష్యత్తులో కూడా ఇంధన ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

# 'ఇంకా పాఠాలు నేర్చుకోలేదు'..

**నీట్ పేపర్ లీక్‌లపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం!**

**న్యూఢిల్లీ, మే 25 (రిపబ్లిక్ న్యూస్):**
దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న నీట్ పేపర్ లీక్ ఘటనలపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో కోర్టు ఎన్ని ఆదేశాలు ఇచ్చినా, ఎన్ని వివాదాలు తలెత్తినా 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ) ఇప్పటికీ ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పరీక్షల నిర్వహణలో సంస్కరణలు కోరుతూ దాఖలైన పిటిషన్లను విచారించిన కోర్టు.. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది.పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని ఫైమా, యూడీఎఫ్ సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. లోపభూయిష్టంగా మారిన ఎన్‌టీఏ స్థానంలో సరికొత్త వ్యవస్థను తీసుకురావాలని లేదా దాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోర్టును కోరారు. నీట్ యూజీ పరీక్షలను కట్టుదిట్టంగా, స్వతంత్రంగా నిర్వహించేలా ఒక పటిష్ఠమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో డిమాండ్ చేశారు.


**మూడు రోజుల్లో అఫిడవిట్**

గత నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత పరీక్షల పర్యవేక్షణ కోసం కోర్టు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. గతేడాది నవంబర్ 14న ఏర్పాటైన ఈ మానిటరింగ్ కమిటీ చేసిన సిఫార్సులను ఎంతవరకు అమలు చేశారో స్పష్టం చేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఎన్‌టీఏను ఆదేశించింది. ఈ కమిటీకి నేతృత్వం వహించిన జస్టిస్ రాధాకృష్ణన్ కూడా సిఫార్సుల అమలుపై తీసుకున్న చర్యలను కోర్టుకు వివరించాల్సి ఉంటుంది. ఈ అఫిడవిట్లను మూడు రోజుల్లోగా సమర్పించాలని గడువు విధించింది.

# అట్టహాసంగా పద్మ పురస్కారాలు

**పలువురికి అవార్డులు అందచేసిన రాష్ట్రపతి**

**కార్యక్రమంలో ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు**



**న్యూఢిల్లీ, మే 25 (రిపబ్లిక్ న్యూస్):** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు భారత ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను ప్రదానం చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్, 13 మంది పద్మభూషణ్, 113 మంది పద్మశ్రీలకు ఎంపికయ్యారు. తొలుత సోమవారం 60 మందికి ఈ పురస్కారాలు అందచేశారు. కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

# హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట..

**మొదటిపేజీ తరువాయి**

ఈ కొత్త ఒప్పందం ప్రకారం రాబోయే 20 ఏళ్ల కాలపరిమితితో, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ రుణాన్ని చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. దీనివల్ల హైదరాబాద్ మెట్రోపై ఉన్న తక్షణ ఆర్థిక భారం తగ్గనుంది.

ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు కీలక విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో 100 శాతం యాజమాన్య వాటా పూర్తిగా ప్రభుత్వానికే బదిలీ అయినట్లు స్పష్టం చేశారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

**కనెక్టివిటీ పెంచడమే లక్ష్యం**

దేశ ఆర్థిక వృద్ధిలో హైదరాబాద్ నగరం కీలక ఇంజిన్‌లా మారుతోందని సీఎస్ పేర్కొన్నారు. మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించడం ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రీఫైనాన్స్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ఎల్ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# 16 వేల మంది టీచర్లను జగన్ అవమానిస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి**



"మీ బాధ, ఆక్రోశం నేను అర్థం చేసుకోగలను జగన్ రెడ్డి గారు! మీ ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చెయ్యలేదు, జాబ్ క్యాలెండర్ ఊసేలేదు. మేం 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. త్వరలోనే మరో డీఎస్సీ కూడా ఇవ్వబోతున్నాం. మరింత బిగ్గరగా ఏడవడానికి సిద్ధంగా ఉండండి జగన్ గారూ! మీరు టెన్త్ పేపర్లు ఎత్తుకెళ్లిన దొంగ అని, అందరూ అలాగే ఉంటారనుకోవడం చాలా పెద్ద నేరం. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీలో, నిద్రాహారాలు మాని, చదివి ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన 16 వేల మందిని మీరు అనుమానిస్తున్నారు, అవమానిస్తున్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన టీచర్లు అందరికీ జగన్ గారు లెంపలు వేసుకుని క్షమాపణలు చెప్పాలి. మెగా డీఎస్సీ ఆపాలని 200 కేసులు, గూగుల్, టీసీఎస్ రాకుండా కోర్టులో కేసులు వేయించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా, యువతకు ఉద్యోగాలు లేకుండా వారి భవిష్యత్తు నాశనం చేయాలని చూస్తున్న జగన్ గారూ మిమ్మల్ని రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ క్షమించరు" అంటూ లోకేష్ ఘాటుగా స్పందించారు.

**ఢిల్లీ చేరుకున్న నారా లోకేష్... ఎంపీల ఘనస్వాగతం** ఏపీ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. సోమవారం నాడు ఢిల్లీకి చేరుకున్న ఆయనకు తెలుగుదేశం పార్టీ ఎంపీలు ఘన స్వాగతం పలికారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు లోకేష్ ఢిల్లీకి వెళ్లారు.మంగళవారం (మే 26) ఉదయం 11 గంటలకు ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరగనుంది.

# సుందరీకరణ విధ్వంసకులపై కఠిన చర్యలు తప్పవు

**పోస్టర్లు, బ్యానర్లతో నగర సౌందర్యం పాడుచేస్తే భారీ జరిమానాలు -నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరిక**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 24)**
నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు ప్రజాధనంతో చేపడుతున్న సుందరీకరణ పనులను పోస్టర్లు, బ్యానర్లు అతికించి పాడు చేసే వారిపై ఎలాంటి ఉదాసీనత ప్రదర్శించవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు.
బళ్ళారి చౌరస్తా పరిసర ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్, ఇటీవల జాతీయ రహదారి రిటైనింగ్ వాల్‌పై వేసిన రంగుల అలంకరణలను కొందరు పోస్టర్లు అతికించి దెబ్బతీసిన విషయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డివైడర్లపై కూడా పోస్టర్లు అతికించి నగరాన్ని అపరిశుభ్రంగా మార్చుతున్నారని పేర్కొన్నారు.
సంబంధిత వ్యక్తులకు ఫోన్ ద్వారా హెచ్చరికలు జారీ చేసిన కమిషనర్, వెంటనే పోస్టర్లు తొలగించాలని ఆదేశించారు. లేకపోతే మున్సిపల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగర సుందరీకరణను ధ్వంసం చేసే వారిపై భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఫ్లెక్సీ ప్రింటింగ్ నిర్వాహకులు, బ్యానర్లు అతికించే వారితో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.
అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కమిషనర్, స్వచ్ఛత నిర్వహణలో ఉన్న సమస్యలను ఇంజనీరింగ్ విభాగంతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించాలని నోడల్ అధికారి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు.
ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 90% సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

**బ్యాంకుల్లో రైతులు, కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి -ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 24)**
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కర్నూలు సీఆర్ భవన్‌లో రైతు సంఘం జిల్లా కౌన్సిల్ విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి కే. జగన్నాథం, జిల్లా కార్యదర్శి పి. పంపన గౌడ్ హాజరయ్యారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు 90 శాతం సబ్సిడీపై అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో నాణ్యతలేని విత్తనాలు, ఎరువులు బహిరంగంగా విక్రయిస్తున్నప్పటికీ వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. నకిలీ విత్తనాలు, నాణ్యతలేని ఎరువులు విక్రయించే దుకాణాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పంట రుణాలు, అన్నదాత సుఖీభవ పథకం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించాలని తెలిపారు.
జిల్లా కార్యదర్శి పి. పంపన గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆర్డీఎస్, గుండ్రేవుల, వేదవతి సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు 90 శాతం సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు.
సమావేశంలో రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకాన్ని రూ. 20 వేల నుంచి రూ. 50 వేల వరకు పెంచాలని, రైతులు మరియు కౌలు రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేయాలని తీర్మానించారు. తెలంగాణ రాష్ట్రం మాదిరిగా రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రూ. 2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.
అలాగే జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూన్ 1న అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపునిచ్చింది. జిల్లా వ్యాప్తంగా రైతు సంఘం శ్రేణులు పాల్గొని ధర్నాలను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో పత్తికొండ రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు ఉమాపతి, కార్యదర్శి సురేంద్ర కుమార్, ఏపీ చేతివృత్తుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు చదువుల కాశి, మద్దిలేటి నాయుడు, వాల్మీకి రాముడు, డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి చింతల మహేష్, బసాపురం గోపాల్, పరమేశ్వర్ రెడ్డి, మబ్బు ఆంజనేయులు, రైతు నాయకులు సుంకన్న, భాషా, బి. మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# 2027 నాటికి నంద్యాల జిల్లాను సంపూర్ణ అక్షరాస్య జిల్లాగా తీర్చిదిద్దుతాం

**అక్షరాస్యత ఉద్యమంలో రాష్ట్రంలోనే తొలి ఐదు జిల్లాల్లో నంద్యాల స్థానం**

**ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో నిరక్షరాస్యత నిర్మూలన సాధ్యం**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**





**నంద్యాల బ్యూరో, మే 25 (రిపబ్లిక్ న్యూస్):**
నంద్యాల జిల్లాను 2027 నాటికి సంపూర్ణ అక్షరాస్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో అక్షరాస్యత కార్యక్రమ అమలుపై అధికారులతో కన్వెర్జెన్సీ సమావేశం నిర్వహించారు. వయోజన విద్య ఉపసంచాలకులు చంద్రశేఖర్ రెడ్డి, డిఆర్డిఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జెడ్పి డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డిపిఓ లాలితాభాయి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అక్షరాస్యత కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహిస్తూ ప్రతి నిరక్షరాస్యుడికి చదువు అందించాలనే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా గతంలో 1,01,021 మంది వివరాలను యాప్‌లో నమోదు చేయగా, వారిలో లక్షా 966 మంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి దాదాపు 100 శాతం ఫలితాలు నమోదు కావడం సంతోషకరమన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అక్షరాస్యత శాతంలో దేశంలోనే వెనుకబడిన రాష్ట్రాల్లో ఒకటిగా ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యల వల్ల పరిస్థితి మారుతోందన్నారు. "ఉల్లాస్-1" కార్యక్రమం ద్వారా ఇప్పటికే 26 వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దామని, అయితే 2022లో నిర్వహించిన సర్వే ప్రకారం జిల్లాలో ఇంకా 3.25 లక్షల మందికి పైగా నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించామని కలెక్టర్ తెలిపారు. వీరందరినీ మూడు సంవత్సరాలలో అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం లక్షకు పైగా మందిని టార్గెట్‌గా తీసుకుని కార్యాచరణ కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 3.20 లక్షల మంది నిరక్షరాస్యులు ఉండగా, అందులో ఇప్పటికే దాదాపు లక్ష మంది అక్షరాస్యులయ్యారని తెలిపారు. ఇంకా మిగిలిన వారిలో కనీసం 50 శాతం మందిని, అంటే సుమారు 1.12 లక్షల మందిని ప్రస్తుత దశలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఇందుకు సంబంధించిన 2.24 లక్షల మంది వివరాలు ఇప్పటికే యాప్‌లో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అక్షరాస్యత కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. యాప్‌లో టీచర్లు, లెర్నర్ల మ్యాపింగ్‌ను వేగవంతంగా పూర్తి చేయాలని, ఇప్పటికే చదువు తెలిసిన వారిని "లిటరేట్" కేటగిరీలో నమోదు చేసి డేటాను అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రతి 10 మంది లెర్నర్లకు ఒక వాలంటీర్ అవసరమని, అవసరమైన చోట కొత్త వాలంటీర్లను యాప్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మండల స్థాయిలో వివో ఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, రిసోర్స్ పర్సన్లు సమన్వయంతో పనిచేసి మిస్సింగ్ డేటాను సరిచూసి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈ కోర్సులో 8 పాఠాలు, 32 ప్రాక్టీస్ వర్క్‌షీట్లు ఉండనున్నాయని, మొత్తం 100 గంటల శిక్షణలో ఆడియో విజువల్స్, క్లాస్‌రూమ్ బోధన, ప్రాక్టీస్ వర్క్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జూలై 21 నుండి తరగతులు ప్రారంభమై 2027 మార్చి వరకు కొనసాగుతాయని చెప్పారు. మే 28 నుండి జూన్ 30 వరకు యాప్‌లో డేటా అప్‌లోడ్ ప్రక్రియ పూర్తి చేయాలని, జూన్ 28లోపు టీచర్లు, లెర్నర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నంద్యాల జిల్లా అక్షరాస్యత కార్యక్రమంలో రాష్ట్రంలోనే తొలి ఐదు జిల్లాల్లో నిలవడం గర్వకారణమని, దీనికి అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు సమిష్టిగా కృషి చేయడం కారణమని కలెక్టర్ అభినందించారు.



## బుద్ధానగర్ గ్రామంలో వింత ఘటన....!

## బొటన వేలి అకృతిలో కోడిగుడ్డు





**పాములపాడు మే 25 రిపబ్లిక్ న్యూస్ :-**
పాములపాడు. మండలంలోని, మిట్టకందల గ్రామ పంచాయతీలో ఉన్న బుద్ధానగర్ గ్రామంలో వింత ఘటన చోటు చేసుకుంది. అంగడి గాలిరెడ్డి అనే రైతుకు చెందిన కోడిపెట్టే గుడ్డు ఒక వింతగా పెట్టడం చూసి గ్రామస్థులు ఆశ్చర్యానికి గురి అయ్యారు. గ్రామంలో సాయంత్రం ఈ ఆరుదయినా ఘటన చోటు చేసుకుంది. దీనిని చూడడానికి ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు.

## సిరిపురం లో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం





**హత్నూర 25 మే 26( రిపబ్లిక్ న్యూస్)**
సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని సిరిపురం గ్రామంలో నూతనంగా ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో ప్రజలు కొత్త ఆధార్ నమోదు ఆధార్ సవరణలు మొబైల్ నెంబర్ లింక్ బయోమెట్రిక్ అప్డేట్ పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్ పుట్టి వీరేశం విష్ణువర్ధన్ రెడ్డి వెంకట్ రెడ్డి చిన్న నరసింహులు పెద్ద గొల్ల శ్రీనివాస్ విజేందర్ రెడ్డి పూల శంకర్ కాలే ఆగం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు ఈ ఆధార్ కేంద్రం ద్వారా సిరిపురం గ్రామం తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు కూడా సౌకర్యవంతమైన సేవలు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు ఈ కేంద్రం యొక్క ప్రొఫెటర్ ఎల్ చంద్రమోహన్ రెడ్డి కాగా ఆపరేటర్ పూల సౌమ్య సేవలను అందించనున్నారు ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## పేదల భూములను కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న డిమాండ్**




**ఓర్వకల్లు ప్రతినిధి, మే 25(రిపబ్లిక్ న్యూస్)**
సోమవారం రోజున ఓర్వకల్లుమండలం నన్నూరు గ్రామంలోని సర్వే నెంబర్ 1338 /1 లో ఆర్ వెంకటమ్మ అనే పేదరాలైన ఆమె భూమిని పదే పదే తన సొంత జెసిబి తో కబ్జా చేయడానికి నన్నూరు గ్రామానికి చెందిన వ్యక్తి ప్రయత్నిస్తున్నాడని ఓర్వకల్లు డిప్యూటీ తాసిల్దారు సతీష్ కుమార్ ని కలిసి భూమిని కబ్జా చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకొని బాధితురాలికి న్యాయం చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న మాట్లాడుతూ ఓర్వకల్లు మండలం పరిశ్రమల హబ్బు కావడంతో భూమి విలువ అనేక రెట్లు పెరిగిందని దీనివల్ల బడుగు బలహీన వర్గాల పేదల భూములను కబ్జా చేయడం కోసం పలుకుబడి కలిగిన కొంతమంది వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మండల రెవెన్యూ అధికారులు ఇటువంటి కబ్జాదారులపై విచారించి కఠినమైన చర్యలు తీసుకొని బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఆందోళన చేపడతామని అన్నారు అనంతరం డిప్యూటీ తాసిల్దార్ సతీష్ కుమార్ మాట్లాడుతూ విచారణ చేపడతామని తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆర్ రామకృష్ణ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు

## డోన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై కోర్టు కఠిన చర్యలు

**ముగ్గురికి జైలు శిక్షలు, జరిమానా విధింపు**




**డోన్ ప్రతినిధి, మే 25(రిపబ్లిక్ న్యూస్)**
డోన్,పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కోర్టు కఠిన చర్యలు తీసుకుంది. డోన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మూడు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై డోన్ ప్రత్యేక ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి నురుల్లా కోర్టులో విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం కొండపేటకు చెందిన బెస్త సునీల్ కుమార్ (25)కు ఆరు రోజుల జైలు శిక్ష విధించారు. అలాగే కొండపేటకు చెందిన షేక్ దాదా ఖాలందర్ (27)కు మూడు రోజుల జైలు శిక్ష ఖరారు చేశారు. మరో కేసులో అంబేద్కర్ నగర్‌కు చెందిన కే. ప్రశాంత్ కుమార్ (24)కు రూ. 10 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. ఇటువంటి చర్యల వల్ల డ్రైవర్ల ప్రాణాలతో పాటు అమాయక ప్రజల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి కోర్టు ముందు హాజరుపరుస్తామని స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారికి భారీ జరిమానాలు, జైలు శిక్షలు తప్పవని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని డోన్ టౌన్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి నివాళులు అర్పించిన సిఐటియు నాయకులు ఆటో డ్రైవర్లు





**డోన్ ప్రతినిధి, మే 25(రిపబ్లిక్ న్యూస్)**డోన్ పట్టణం పాత బస్టాండ్ మ్యాజిక్ ఆటో స్టాండ్ కు చెందిన ఆటో డ్రైవర్ డి.సుబ్బరాయుడు (65) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతికి సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బి.మాణిక్యం శెట్టి,టి.శివరాం,ఆటో డ్రైవర్లు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణ శివారు వెంకటనాయుని పల్లె రోడ్డు లో గల మృతుని స్వగృహం నందు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బరాయుడు అకాల మరణం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో శ్రీనివాసులు,వెంకటేశ్వర్లుగౌడ్,శ్రీరాములు,అల్లాబకాష్,రామకృష్ణ,నాగేశ్వరరావు,ప్రతాప్,కృష్ణ,గిరిబాబు, మనోహర్,హుస్సేన్ భాష,కిరణ్ కుమార్,డానియల్ తదితరులు ఉన్నారు

# ఆర్ఎస్ రంగాపురం లో డ్రైనేజి కాలువలు ఏర్పాటు చేయండి..

**గ్రామస్థులు ఏళ్ళ తరబడి మురికి నీటిలో వెళ్తున్న వైనం**

**మా గ్రామం లోని సమస్య లు తీర్చండి.. సారు**

**బేతంచెర్ల ప్రతినిధి,మే 25 (రిపబ్లిక్ న్యూస్)**
బేతంచెర్ల మండలం ఆర్ ఎస్ రంగాపురం గ్రామం లోని ప్రభుత్వ ఆసుపత్రి ముందర ఉన్న సీసీ రోడ్ కు ఎన్నో ఏళ్ళ నుండి డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయలేదని గ్రామస్థులు సోమవారం విలేకరులకు తెలిపారు. వారు మాట్లాడుతూ.మా కాలనీ లో సీసీ రోడ్డు వేసి,డ్రైనేజీ కాలువలు వేయడం మరిచారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.రాబోయే వర్ష కాలం లో మా కాలనీ మురికి కూపంగా మారుతుందని వారు వాపోతున్నారు. సీసీ రోడ్డు మీద డ్రైనేజీ నీరు చేరుకుంటుందని,తద్వారా మేము నానా రోగాల బారిన పడుతున్నామన్నారు. ఆ రోడ్డు మీద డ్రైనేజీ నీళ్లు ఉండటంతో వాహనదారులు, ప్రజలు వెళ్ళా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు . కాబట్టి సంధిత అధికారులు స్పందించి వెంటనే డ్రైనేజి కాలువలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు



## ఓర్వకల్లు మండల గ్రామాల్లో 1వ తరగతి నుండి 10 తరగతి వరకు బుక్కులు పంపిణీ

**ఓర్వకల్లు మండల విద్యాశాఖ అధికారి జి ఓంకార్ యాదవ్**



**ఓర్వకల్లు ప్రతినిధి, మే 25(పబ్లిక్ న్యూస్)**
సోమవారం రోజున ఓర్వకల్లు మండల గ్రామాల్లో ప్రతి గ్రామానికి వీజూ జి.ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలలకు Spell -1 1 వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది

# స్మశాన వాటిక కోసం వినతి




**బండి ఆత్మకూరు, మే 25, (రిపబ్లిక్ న్యూస్) :-** బండి ఆత్మకూరు మండలం, బి.కోడూరు గ్రామంలో దళితులు (మాదిగలు) ఎవరైనా మరణిస్తే పూడ్చి పెట్టడానికి ఆరడుగుల స్థలం కూడా లేదని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండలంలోని బి.కోడూరు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు శివకుమార్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు స్మశాన వాటిక కోసం స్థలం కేటాయించి తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని తహసిల్దార్ పద్మావతమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో స్మశాన వాటిక లేకపోవడంతో రహదారికి పక్కనే ఉన్న కొద్దిపాటి స్థలంలో అంతిమ క్రియలు చేయాల్సి వస్తుందన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఎదుర్కొంటున్న ఈ సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువచ్చిన పరిష్కారం చూపకపోవడంతో మరోసారి వినతి పత్రం అందజేయాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల వెంకటసుబ్బన్న, దశరథుడు, ఎర్రమల, విద్యార్థి సంఘం నాయకులు వెంగళరావు, సిసింద్రీ, తిరుమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తాలిం-ఏ-హునర్ ఫలితాల విడుదల

**250 మంది ప్రతిభావంతులైన విద్యార్థుల ఎంపిక**

**ఫలితాలను విడుదల చేసిన మంత్రి ఎన్ఎండీ ఫరూక్, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్**

**నంద్యాల బ్యూరో, మే 25 (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "తాలిం-ఏ-హునర్" టాలెంట్ టెస్ట్ ఫలితాలను సోమవారం నంద్యాలలోని ఎన్టీఆర్ షాదీఖానాలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మరియు ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,392 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 6,605 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 250 మంది విద్యార్థులను ఎంపిక చేయగా, తదుపరి ర్యాంకులు సాధించిన 50 మందిని రిజర్వ్ జాబితాలో ఉంచారు. ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో ఖాళీలు ఏర్పడిన పక్షంలో రిజర్వ్ జాబితాలో ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులను వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సత్కరించారు. ఫలితాల విడుదల అనంతరం మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ, 250 మంది విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య అందించేందుకు వక్ఫ్ బోర్డు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్



అజీజ్, సభ్యులు తీసుకున్న నిర్ణయం గొప్పదని కొనియాడారు. వక్ఫ్ బోర్డుకు ఉన్న ఆస్తులను సమర్థవంతంగా వినియోగించి పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా బాలికల విద్యకు మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు. ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, భారతదేశ చరిత్రలోనే తొలిసారిగా వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ఈ స్థాయిలో విద్యా ప్రోత్సాహక కార్యక్రమం చేపట్టామని తెలిపారు. విద్య ద్వారానే పేదరికాన్ని నిర్మూలించి గౌరవప్రదమైన జీవితం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముస్లిం సమాజం అభివృద్ధి చెందాలంటే నాణ్యమైన విద్య అత్యవసరమని, కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో "తాలిం-ఏ-హునర్" పథకాన్ని తీసుకువచ్చామని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి ఫరూక్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఇది రాజకీయ కార్యక్రమం కాదని, పేద తల్లిదండ్రుల ఆశయాలకు వేదికగా నిలిచే విద్యా ఉద్యమమని పేర్కొన్నారు. విద్య మాత్రమే శాశ్వత ఆస్తి అని, ఇంటర్ విద్యతో ఈ పథకం ఆగకుండా భవిష్యత్తులో యూపీఎస్సీ వంటి ఉన్నత చదువులకు కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తామని వెల్లడించారు. నంద్యాలలో అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థ స్థాపనకు కృషి చేస్తామని అబ్దుల్ అజీజ్ తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని భావించగా, 56 శాతం దరఖాస్తులు బాలికల నుంచే రావడం ఆనందదాయకమని, అందులో 41 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషమని పేర్కొన్నారు. టాలెంట్ టెస్ట్ ఫలితాల్లో కడప, నెల్లూరు, గుంటూరు, నంద్యాల, కర్నూలు జిల్లాలు తొలి ఐదు స్థానాల్లో నిలిచినట్లు వెల్లడించారు.

# భూముల కౌలు వేలాలతో ఆలయాలకు పెరిగిన ఆదాయం



**బండి ఆత్మకూరు, మే 25, (రిపబ్లిక్ న్యూస్):-** బండి ఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశవ, ఈశ్వర, కోదండ రామస్వామి ఆలయానికి చెందిన మాన్యం భూములకు ఆలయ అధికారులు బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. సోమవారం ఆలయ కార్యనిర్వహణాధికారి నాగప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కౌలు వేలాలకు పర్యవేక్షణ అధికారిగా వెలుగోడు మండల గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి జనార్ధన్ హాజరయ్యారు. సుమారు 47.23 ఎకరాల మాన్యం భూమినీ రూ 10.07 లక్షలకు రైతులు ఒక ఏడాది కౌలుకు దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే భూమికి రూ 9.57 లక్షలు వచ్చిందని ఈవో తెలిపారు. గత ఏడాది కంటే ప్రస్తుత ఏడాది రూ.1.07 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆయన వివరించారు. అలాగే బి.కోడూరు గ్రామంలో నిర్వహించిన ఆలయ భూముల వేలంపాటల్లో 21.53 ఎకరాల మన్యం భూమిని రూ.6.41 లక్షలకు రైతులు ఒక ఏడాది కౌలుకు దక్కించుకున్నారు. అయితే గత ఏడాది ఇదే భూమికి రూ 5.90 లక్షలు వచ్చినట్లు ఈవో తెలిపారు. ప్రస్తుత ఏడాది రూ 51 వేలు ఆదాయం పెరిగినట్లు ఈవో వివరించారు. అనంతరం ఓంకారం దేవస్థానానికి చెందిన రెండున్నర ఎకరాల భూమికి రూ 97 వేలు వచ్చినట్లు ఈవో వెల్లడించారు. ఈ వేలం పాటల్లో ఆయా గ్రామాలకు చెందిన ఆలయ చైర్మన్ లు, పాలకమండలి సభ్యులు ఆలయ సిబ్బంది నాగరాజు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ఆగ్రహం

**ఆటోకు తాళ్లు కట్టి లాగుతూ వినూత్న నిరసన - సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆందోళన**

**అనంతపురం / శింగనమల, మే 25,(రిపబ్లిక్ న్యూస్):**
పెట్రోల్‌పై రూ.10, డీజిల్‌పై రూ.8 వరకు ధరలు పెంచడాన్ని నిరసిస్తూ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో శింగనమల మండల కేంద్రంలో సోమవారం వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆటోరిక్షాకు తాళ్లు కట్టి రోడ్డుపై లాగుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి**
ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు తరిమెల రామాంజనేయులు, ఐఎఫ్‌టీయూ కమిటీ సభ్యులు వెర్రి స్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వరుసగా ఇంధన ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని మండిపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం కేంద్ర ప్రభుత్వ అసలు వైఖరికి నిదర్శనమన్నారు.దేశంలో ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ఇప్పుడు ఇంధన ధరల పెంపుతో సామాన్యులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన ప్రతిసారీ రవాణా ఖర్చులు అధికమై ఆ ప్రభావం ఆహారం, మందులు, కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తులు సహా ప్రతి వస్తువుపై పడుతుందని తెలిపారు. దీంతో ప్రతి కుటుంబ బడ్జెట్ దెబ్బతింటోందన్నారు. ఇంధన ధరల



పెంపు అనేది పేదలపై అదనపు పన్ను మోపినట్టే. కార్పొరేట్ సంస్థల లాభాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలను బలి చేస్తున్నది అని వారు ఆరోపించారు. ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని సూచనలు చేసే ప్రధాని మోడీ, తన విదేశీ పర్యటనలు, విలాసవంతమైన ఖర్చులపై ఎంత ప్రజాధనం వెచ్చిస్తున్నారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో "ఒక పూట భోజనం చేసి మరో పూట యోగా చేయండి" అని కూడా కేంద్ర ప్రభుత్వం చెప్పే పరిస్థితి వస్తుందేమోనని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. పెరుగుతున్న ధరలతో రైతులు, కార్మికులు, ఆటో డ్రైవర్లు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. టీడీపీ మద్దతుతోనే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొనసాగుతోందని, కాబట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి పెట్రోల్, డీజిల్ ధరల పెంపును వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ప్రజల తరపున కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం మండల కార్యదర్శి లక్ష్మీరంగయ్య, శంకరయ్య, లక్ష్మీనారాయణ, స్వర్ణగప్ప, శ్రీనివాసులు, వజ్రగిరి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


# రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్ సాధించిన అనంత విద్యార్థిని

**కుమారి నాయిమా సాదియాకు ఘన సన్మానం**

**జీవితకాల విద్యా సహాయం ప్రకటించిన జామియా మసీదు ముతవల్లీలు**



**అనంతపురం సంక్షేమం, మే 25,(రిపబ్లిక్ న్యూస్):**
కృషి,పట్టుదల ఉంటే రాష్ట్రస్థాయిలో సత్తా చాటగలరని విద్యార్థిని కుమారి షేక్ మకాంధర్ నాయిమా సాదియా నిరూపించింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన "తాలీం ఏ హునర్ టాలెంట్ టెస్ట్" పరీక్షల్లో తొలి ర్యాంకు సాధించి అనంతపురం జిల్లాకు గర్వకారణంగా నిలిచిన విద్యార్థిని కుమారి షేక్ మకాంధర్ నాయిమా సాదియాను ఘనంగా సన్మానించారు.



ఈ సందర్భంగా రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షులు కే.ఎం షకీల్ షఫీ , మాజీ కౌన్సిలర్ మాసుం బాబా విద్యార్థినిని అభినందిస్తూ ఆమె ప్రతిభను కొనియాడారు. విద్యార్థిని ఉన్నత చదువులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా జామియా మసీదు తరపున జీవితకాలం ఆర్థిక సహాయం అందిస్తామని వారు ప్రకటించారు. జామియా మసీదు ముతవల్లిగా విద్యార్థిని విద్యాభ్యాసానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.అదేవిధంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వీడియో కాల్ ద్వారా విద్యార్థినితో మాట్లాడి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పలువురు ముస్లిం మత పెద్దలు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు పాల్గొని విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు.

# దుకాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి

**-నేరాల నియంత్రణకు వ్యాపారులు సహకరించాలి:- పి.తిరుపాలు(పాములపాడు ఎస్ఐ)**

**పాములపాడు మే 25 రిపబ్లిక్ న్యూస్:-**
పాములపాడు మండలం ప్రజల భద్రత, నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై- పి.తిరుపాలు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పాములపాడులోని, అన్ని దుకాణాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై పి.తిరుపాలు మాట్లాడుతూ . నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో సీసీ కెమెరాల దృశ్యాలు కీలక ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు.
ప్రతి షాపు, వ్యాపార సముదాయంలో నాణ్యమైన సీసీ



కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడానికి సీసీ కెమెరాల వ్యవస్థ అవసరమని సూచించారు.

అలాగే పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు జాగ్రత్తలు సూచించారు అనంతరం వ్యాపారులందరికీ నోటీసులు జారీ చేశారు.

ప్రజలు, వ్యాపారులు పోలీసు శాఖకు సహకరించి తమ పరిసరాల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఎం.వి.రమణ, కానిస్టేబుల్ లు ఏ.ఖాజా, టావేశ్వర్, వ్యాపారస్తులు పాల్గొన్నారు

## వర్చువల్ మహానాడు విజయవంతం చేద్దాం



**గుత్తి మే 25 : రిపబ్లిక్ న్యూస్** గుత్తి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లోని స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచనలకు మేరకు క్లస్టర్స్ ఇంచార్జ్ బూత్ క్లస్టర్స్ ఇంచార్జ్ లతో వర్చువల్ మహానాడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'మహానాడు మే 27, 28 తేదీలలో వర్చువల్ (ఆన్‌లైన్) మరియు హైబ్రిడ్ పద్ధతిలో రెండు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి ఎక్కువ మంది ప్రజలకు చేరువయ్యేలా ఈ నిర్ణయం తీసుకున్నారు.మహానాడు 2026 పార్టీ కేంద్ర కార్యాలయం నుండి టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పొలిట్‌బ్యూరో, కేంద్ర మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఎంపీలు, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు తమ ప్రాంతాల నుంచే ఆన్‌లైన్ లేదా క్లస్టర్ల వారీగా ఈ సమావేశాల్లో వర్చువల్‌గా భాగస్వామ్యమవుతారు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ సూర్య ప్రతాప్ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీనివాసులు రమేష్ రాజా మాజీ సర్పంచ్ రామలింగమయ్య పట్టణ ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్ బోర్వెల్ నాగరాజు రామకృష్ణ ఎస్ఎం భాష మహిళా అధ్యక్షురాలు సునీత మాజీ సర్పంచ్ చితంబరం ఆయకట్టు చైర్మన్ శ్రీనివాసులు పరుశురాం తదితరులు పాల్గొన్నారు

# గ్రామీణ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

**మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ పిలుపు -ఎం ఎస్ ఎం ఈ పార్కులతో పారిశ్రామిక విప్లవం**

**శ్రీ సత్య సాయి ప్రతినిధి, మే 25,(రిపబ్లిక్ న్యూస్):**
గ్రామీణ ప్రాంత యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కులు గ్రామీణాభివృద్ధికి కొత్త దిశను చూపనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఎం ఎస్ ఎం ఈ పార్కుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామంలో సోమవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 175 ఎం ఎస్ ఎం ఈ పార్కుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 35కు పైగా ఎం ఎస్ ఎం ఈ పార్కులు, ఎఫ్ ఎఫ్ సిలకు శంకుస్థాపనలు నిర్వహించగా ముఖ్య అతిథిగా జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్,



శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు, ఆర్డీఓ సువర్ణ పాల్గొన్నారు.

**ఎం ఎస్ ఎం ఈ పార్కులతో గ్రామీణాభివృద్ధికి కొత్త దిశ**

ఈ సందర్భంగా చిలక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఎం ఎస్ ఎం ఈ పార్కుల ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల అభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న పారిశ్రామిక విధానాలు యువ పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

**ఉద్యోగాల కల్పన దిశగా యువత ఎదగాలి**

మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ మాట్లాడుతూ యువత చిన్నపాటి ఉద్యోగాలకే పరిమితం కాకుండా పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని పరిశ్రమల స్థాపనలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
ఎం ఎస్ ఎం ఈ పార్కుల ఏర్పాటు ద్వారా స్థానిక వ్యాపారులు, యువ పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, రాష్ట్ర అభివృద్ధిలో గ్రామీణ యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఎన్డీఏ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు , స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీపై బీసీవై పార్టీ ఆగ్రహం

**అనుమతులు లేని విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలి -ఉపాధ్యాయుల సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**

**అనంతపురం కలెక్టరేట్, మే 25,(రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురం జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న అధిక ఫీజుల వసూళ్లు, విద్యార్థుల హక్కుల ఉల్లంఘనలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై పార్టీ) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బీసీవై పార్టీ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొని విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**అధిక ఫీజులు పేద కుటుంబాలపై తీవ్ర భారం**

ఈ సందర్భంగా బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోని శ్రీ చైతన్య, నారాయణ, భాష్యం, ట్రెల్లిస్ ఎడిఫై, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, గ్లోబల్, ఇన్ఫినిటీ తదితర ప్రైవేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి సంవత్సరం ఫీజులను పెంచుతూ మధ్యతరగతి, పేద కుటుంబాలపై తీవ్ర భారం మోపుతున్నారని విమర్శించారు. అదేవిధంగా ఒక సెక్షన్‌కు మాత్రమే అనుమతి తీసుకుని మూడు నుంచి నాలుగు సెక్షన్లు నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలను



ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు సరైన మౌలిక వసతులు లేకపోయినా వేలాది రూపాయలు ఫీజుల పేరుతో వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. వివిధ పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించడం లేదని, పిల్లలు ఆడుకోవడానికి సరైన ఆట స్థలాలు కూడా లేకుండా విద్యాసంస్థలను "జిల్లా జైళ్ల" మాదిరిగా మార్చేశారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుని అవసరమైతే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఆర్ టి ఈ (రైట్ టు ఎడ్యుకేషన్) చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, పేద విద్యార్థులకు ఉచిత విద్య కల్పించే నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.




**విద్యా రంగంలో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యం**

అలాగే రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ అమలు చేయని పాఠశాలలపై కూడా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా వినతిపత్రంలో ప్రస్తావించిన నాయకులు, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా రంగంలో పారదర్శకత తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని బీసీవై నాయకులు స్పష్టం చేశారు.విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జిట్టా రామ్మోహన్ యాదవ్, బెస్త పవన్ కుమార్, మహిళా కన్వీనర్ లక్ష్మి, విద్యార్థి నాయకులు రాము నాయక్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలో అనుమతులు లేకుండా నడుస్తున్న హాస్టలను వెంటనే సీజ్ చేయాలి.



**గుత్తి మే 25 రిపబ్లిక్ న్యూస్** గుత్తి పట్టణంలోని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం తాహసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగాఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్ యాదవ్ మాట్లాడుతూ గుత్తి పట్టణంలో చాలా ప్రైవేట్ పాఠశాలలో అనుమతులు లేకుండా హాస్టల్ నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుని హాస్టల్స్ ని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొన్ని ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాల పేరుతో వేల రూపాయల దండుకొని వ్యాపారం చేస్తూ మా దగ్గరే పుస్తకాలు కొనాలని తల్లిదండ్రులను ఇబ్బంది గురిచేస్తున్న, పాఠలపుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా హాస్టల్ నిర్వహిస్తూ వేల రూపాయలు వసూలు చేస్తున్న అలాంటి పాఠశాలలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసిన చూచి చూడు నట్లు వ్యవహరిస్తున్నారు. వెంటనే స్పందించి ప్రవేట్ పాఠశాలలో నిర్వహించే హాస్టల్స్ ని సీజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి ధన , రామ్ చరణ్ విష్ణువర్ధన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన ధరల పెంపుపై మాజీ ఎమ్మెల్యే కాటసాని నిప్పులు

**బనగానపల్లె మే 25 (రిపబ్లిక్ న్యూస్)**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతం పెంచుతూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే నాలుగు సార్లు ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారన్నారు. మే 15న లీటరుకు రూ.3, మే 19న 95 పైసలు, మే 23న 97 పైసలు, తాజాగా మే 25న రూ.2.87 వరకు పెంచి.. మొత్తంగా పది రోజుల్లోనే లీటరుకు దాదాపు రూ.7.80 పైగా పెంచడం దుర్మార్గమన్నారు.పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే దేశంలో అత్యధికంగా ఇంధన ధరలు ఉన్నాయని, పక్క రాష్ట్రాల కంటే మన దగ్గర రూ.10 వరకు ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. ఎన్నికల ముందు ధరలు పెంచబోమన్న కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక వరుస బాదుడుతో ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే పన్నులు తగ్గించి పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉధృత ఉద్యమం చేపడతామని కాటసాని రామిరెడ్డి హెచ్చరించారు.

# మంత్రి నారా లోకేష్ యూనివర్సిటీల సమన్వయంలో విఫలం

**విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ప్రభుత్వం -చంద్రశేఖర్ యాదవ్**

**సెమిస్టర్ పరీక్షలు స్పోర్ట్స్ కోటా వెరిఫికేషన్ ఒకేసారి నిర్వహించడంపై ఆగ్రహం**

**ఎస్కేయూ వీసీకి వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం వినతిపత్రం**

**అనంతపురం ఎస్కేయూ, మే 25,(రిపబ్లిక్ న్యూస్):**
ఏపీ పీజీసెట్ స్పోర్ట్స్ కోటా సర్టిఫికేట్ వెరిఫికేషన్ తేదీలను సెమిస్టర్ పరీక్షలతో ఒకేసారి నిర్వహించడం విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యూనివర్సిటీల మధ్య సమన్వయం తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని తీవ్ర విమర్శలు గుప్పించారు.ఆదివారం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వీసీకి విద్యార్థి సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

**వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు**


ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాయలసీమ, నెల్లూరు యూనివర్సిటీల పరిధిలో చదువుతున్న అండర్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు మే 11న ఏపీ పీజీసెట్ పరీక్షలు నిర్వహించారని, అనంతరం స్పోర్ట్స్ కోటా సర్టిఫికేట్ వెరిఫికేషన్‌ను మే 22, 23 తేదీల్లో నిర్వహించడం జరిగిందన్నారు. అదే సమయంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిధిలో సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతుండటంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు సెమిస్టర్ పరీక్షలు, మరోవైపు స్పోర్ట్స్ కోటా



వెరిఫికేషన్ ఉండటంతో విద్యార్థులు ఏదో ఒకదాన్ని వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇది తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళిక లేకుండా పరీక్షలు, వెరిఫికేషన్ తేదీలు ఖరారు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి స్పష్టమైన ఉదాహరణ అన్నారు. ఈ నేపథ్యంలో చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకుడు హేమంత్‌తో కలిసి శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌కు వినతిపత్రం అందజేశారు.

**విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించాలి**

ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్లి, సెమిస్టర్ పరీక్షలు, స్పోర్ట్స్ కోటా వెరిఫికేషన్ తేదీల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని వివరించారు.విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సెమిస్టర్ పరీక్షలు, ప్రాక్టికల్స్ పూర్తయిన అనంతరం స్పోర్ట్స్ కోటా సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు మరో అవకాశం కల్పించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో


1/1
YSR SU
YUVAJANA SRAMIKA RAITHU
STUDENT UNION

G.CHANDRASHEKAR YADAV
YSRSU Anantapur Dist President
Email: g.chandrashekar1995@gmail.com
Cell: 8886774016

DATE: 25-05-2026

To
గౌరవ వైస్ ఛాన్సలర్ గారికి
శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ
అనంతపురము,ఆంధ్రప్రదేశ్.

విషయం: సెమిస్టర్ పరీక్షల తేదీలతో పాటు నిర్వహించిన AP PGCET స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్ వెరిఫికేషన్ కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్యలు తీసుకొని, వెరిఫికేషన్‌కు మరో అవకాశం కల్పించవలెనని విజ్ఞప్తి.

మహోదయులు,

రాయలసీమ మరియు నెల్లూరు యూనివర్సిటీల అనుబంధ కళాశాలలలో చదువుతున్న అండర్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు AP PGCET పరీక్షలు ఈ నెల మే 11న నిర్వహించబడిన విషయం విదితమే. అనంతరం స్పోర్ట్స్ కోటాకు సంబంధించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ఈ నెల 22 మరియు 23 తేదీలలో నిర్వహించారు.అయితే అదే తేదీలలో Sri Krishnadevaraya University పరిధిలో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించబడటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఒకే రోజుల్లో సెమిస్టర్ పరీక్షలు మరియు స్పోర్ట్స్ కోటా వెరిఫికేషన్ నిర్వహించడంతో విద్యార్థులు రెండింటికీ హాజరు కాలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాకు చెందిన వేలాది మంది విద్యార్థులు నష్టపోయే పరిస్థితి నెలకొంది.

అందువల్ల, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, విశ్వవిద్యాలయం తరఫున సంబంధిత అధికారులతో మాట్లాడి, సెమిస్టర్ పరీక్షలు మరియు ప్రాక్టికల్స్ పూర్తైన అనంతరం స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు మరో అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం తరఫున మనవి చేస్తున్నాము.

ధన్యవాదాలు.

పెట్టుకొని ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని, దీనివల్ల విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరుగుతోందన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం నాయకులు మనోజ్, జస్వంత్ రెడ్డి, అశోక్, శివ, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ లో చైల్డ్ హెల్ప్ లైన్ -1098 అవగాహన సదస్సు



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 24)**
ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీమతి పి.విజయ ఆదేశాల మేరకు చైల్డ్ హెల్ప్ లైన్ -1098 సిబ్బంది సుంకన్న కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నందు ఆటో డ్రైవర్ల కు చైల్డ్ హెల్ప్ లైన్ -1098 యొక్క అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టోల్ ఫ్రీ నెంబర్ 1098 యొక్క ప్రాముఖ్యత మరియు దాని సేవలను వివరించి రైల్వే స్టేషన్ మరియు బస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 0-18 సం,, ల వయస్సు గల పిల్లలు ఆపదలో ఉంటే 1098 కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఫ్ ఏఎస్ఐ మురళి గారు మరియు యాక్సెస్ జస్టిస్ టు ఆల్ చిల్డ్రన్ బృందం సభ్యులు మునిస్వామి, రైల్వే ఆటో యూనియన్ అధ్యక్షుడు సుంకన్న పాల్గొన్నారు.

# జి.పి. కొండయ్య మరణం .. టీడీపీకి తీరని లోటు

## అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస

## భౌతికకాయానికి నివాళులర్పించిన మంత్రి పయ్యావుల



**అనంతపురం/వజ్రకరూరు క్రైమ్, మే25,(రిపబ్లిక్ న్యూస్):**

అనంతపురం జిల్లా వజ్రకరూరు ప్రాంతానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జి.పి. కొండయ్య చౌదరి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందడం పార్టీ శ్రేణుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను స్థానిక నాయకులు స్మరించుకున్నారు.కొండయ్య చౌదరి మరణవార్త తెలిసిన వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వారి నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జి.పి. కొండయ్య చౌదరి తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో పనిచేసిన నిబద్ధత కలిగిన నాయకుడని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి ఆయన విశేష కృషి చేశారని, కార్యకర్తలకు మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కొండయ్య చౌదరికి నివాళులర్పించారు.

# 123 మున్సిపాలిటీల్లో 14వందల కోట్లతో డ్రైనేజీలు

## మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వెల్లడి

**నెల్లూరు, మే 25 (రిపబ్లిక్ న్యూస్):**



ఏపీలోని 123 మున్సిపాల్టీల్లో రూ.14వందల కోట్లతో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో పలు మున్సిపల్ స్కూళ్లను దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హైబ్రిడ్ ద్వారా మహానాడు నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో మహానాడు మాదిరిగానే తీర్మానాలు, ఆమోదాలు ఉంటాయని చెప్పారు. కచ్చితంగా కార్యకర్తలకు మాట్లాడే అవకాశం ఉంటుందని అన్నారు. నెల్లూరులో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తచరిత్ర ఎవరిదో ఏపీ ప్రజలందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. జగన్ అండ్ కో అసత్యాలు మాట్లాడేస్తే జనం నమ్మరని అన్నారు. రక్తచరిత్ర తెలుసు కాబట్టే గత ఎన్నికల్లో వైసీపీని 11సీట్లకు ప్రజలు పరిమితం చేశారని.. ఈ సారి జీరో తప్పదని హెచ్చరించారు. తమ ప్రభుత్వంపై కావాలని జగన్ అండ్ కో అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఎందుకు వినియోగించలేదని ప్రశ్నించారు. చివరకు స్వచ్ఛభారత్ నిధులను కూడా వినియోగించలేదని ఆగ్రహించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పారదర్శకంగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించి, నిజాయతీగా పోస్టులు కేటాయించారని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంపై జగన్ అండ్ కో విమర్శలు చేయడం దారుణమని దుయ్యబట్టారు.

---------

# ఇశాన్వీ నుంచి బయటకు వచ్చాం

## నోటీసులపై 27న వివరణ ఇస్తాం -విజయవాడ ఎంపి కేశినేని చిన్ని

**విజయవాడ, మే 25 (రిపబ్లిక్ న్యూస్):**ఇశాన్వీ, కేశినేని డెవలపర్స్ సనీస్థలు కలిసి చేసిన రియల్ ఎస్టేట్ సంస్థకు ఈడీ అధికారుల నుంచి ఓ నోటీసు వచ్చిందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఆ కంపెనీకి వచ్చిన నోటీసుపై ఈనెల 27వ తేదీన వివరణ ఇస్తామని పేర్కొన్నారు. పక్క పక్క సైట్లు ఉండటంతో రాజ్ కసిరెడ్డికి సంబంధించిన ఇశాన్వీ సంస్థతో 2021లో రియల్ ఎస్టేట్ చేసేందుకు ప్రైడ్ ఇన్‌ఫ్రా సంస్థ ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. ఆ సంస్థ ద్వారా రూ.35 లక్షల లావాదేవీలు జరిగాయని తెలిపారు. సోమవారం విజయవాడలో కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడారు. రాజ్ కసిరెడ్డి సంగతి తెలిశాక 2022లోనే.. ఆ కంపెనీ నుంచి బయటకు వచ్చేశామని కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. ఆ లావాదేవీకి సంబంధించే ఈడీ అధికారులు సమాధానం కోరుతూ నోటీసు పంపించారని వెల్లడించారు. ఆర్కిటెక్ ఫీజు కోసం చేసిన రూ.35లక్షల ట్రాన్సాక్షన్ తప్ప ఇంకేమి జరగలేదని ఈడీ అధికారులకు చెబుతామని తెలిపారు. లిక్కర్ స్కామ్‌లో తన భార్యకు నోటీసులు వచ్చినట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవమని అన్నారు. అప్పుడు పెట్టిన కంపెనీలో తన భార్య ఒక డైరెక్టర్ మాత్రమేనని తేల్చిచెప్పారు. ఆ కంపెనీకి నోటీసు వచ్చిందే తప్ప.. తన భార్యకు ఎలాంటి నోటీసు రాలేదని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

--------------------

# పెట్రో ధరల పెంపు ఎవరి కోసం

## కేంద్రం తీరుపై మండిపడ్డ మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ, మే 25 (రిపబ్లిక్ న్యూస్):**



శంలో రోజురోజుకు పెరుగుతోన్న ఇంధన ధరల పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. ఈ రోజూవారీ దోపిడీ వల్ల ఎవరు లాభపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. 2014లో రూ.71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను మోదీ సర్కారు 2026 నాటికి రూ.102.12కు చేర్చిందని ఎద్దేవా చేశారు. రెండు వారాల లోపే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ఇది నాలుగోసారి అని.. ఈ రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదన్నారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు వరుసగా 5.8, 4.44, 3.90 శాతం పెరిగాయన్నారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం భాజపా నైజమన్నారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్‌ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం భాజపా దోపిడీ భారాన్ని మోస్తోందన్నారు. దేశవ్యాప్తంగా నేడు మరోసారి భారీగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెంచాయి. పెంచిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. కాగా ఇప్పటికే మూడు విడతలుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. దీంతో దిల్లీలో పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ.103.74గా ఉంది.

# ప్రశాంత వాతావరణంలో బక్రీద్ వేడుకలు జరుపుకుందాం

## హిందూముస్లింలు సామరస్యంతో పండుగ జరుపుకోవాలి:- సిఐ వేణుగోపాల్

**దేవనకొండ, మే 25( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**

దేవనకొండ మండలంలో బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ వేణుగోపాల్ ప్రజలకు సూచించారు.సోమవారం దేవనకొండలో శాంతి భద్రతలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ వేణుగోపాల్ మాట్లాడుతూ..

పండుగల సమయంలో పరస్పర గౌరవం, సహకారం ఎంతో అవసరమన్నారు.హిందూ, ముస్లిం సోదరులు కలిసి సామరస్య వాతావరణంలో బక్రీద్ వేడుకలు జరుపుకోవాలని కోరారు.ఎవరూ వదంతులను నమ్మవద్దని సూచించారు.సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను ప్రజలు పట్టించుకోవద్దన్నారు.ఏదైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలు మెరుగ్గా



కొనసాగుతాయని చెప్పారు.పండుగ సమయంలో యువత బాధ్యతాయుతంగావ్యవహరించాలని సూచించారు. అల్లర్లు, వివాదాలకు దారితీసే చర్యలకు దూరంగా ఉండాలన్నారు.ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని పేర్కొన్నారు.మత సామరస్యాన్ని కాపాడటం అందరి బాధ్యత అని అన్నారు.దేవనకొండలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.పోలీసు శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని చెప్పారు.పండుగ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేసినట్లు వెల్లడించారు.సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రజలు ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు.మత పెద్దలు కూడా సామరస్య సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ప్రజాప్రతినిధులు పోలీసుల చర్యలను అభినందించారు.పండుగను సోదరభావంతో జరుపుకోవాలని యువతకుపిలుపునిచ్చారు. అనంతరం అధికారులు శాంతి భద్రతలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, మత పెద్దలు పాల్గొన్నారు.బక్రీద్ పండుగను ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులు ఆకాంక్షించారు.

# శింగనమలలో పారిశ్రామిక విప్లవానికి నాంది

## కణంపల్లిలో ఎంఎస్ఎంఈ పార్క్ శంకుస్థాపన -"ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త" లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు

## యువతకు ఉపాధి, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు : ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

**అనంతపురం / శింగనమల, మే 25,(రిపబ్లిక్ న్యూస్):**

శింగనమల నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. గార్లదిన్నె మండలం కణంపల్లి గ్రామంలో ప్రతిష్టాత్మక ఎంఎస్ఎంఈ పార్క్ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఆర్డీఓ కేశవనాయుడు, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఆలం నరసనాయుడు తదితరులు పాల్గొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 38 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిన సందర్భంగా కణంపల్లి పార్క్‌కు కూడా శంకుస్థాపన నిర్వహించారు.

**పార్క్ కోసం మొత్తం 112.32 ఎకరాల భూమి సేకరణ**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త" కార్యక్రమం రాష్ట్ర యువతకు కొత్త ఆశలు, కొత్త అవకాశాలను తీసుకువస్తోందన్నారు.ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అందులో భాగంగా శింగనమల నియోజకవర్గానికి ఈ పార్క్ మంజూరు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పార్క్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభించనున్నాయని చెప్పారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఇది పెద్ద ఊతమవుతుందని పేర్కొన్నారు.



**గ్రామీణ యువత పరిశ్రమల రంగంలో ముందుకు రావాలి**

ఈ పార్క్ కోసం మొత్తం 112.32 ఎకరాల భూమి సేకరణ ప్రక్రియ చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇందులో 92.46 ఎకరాల డీకేటీ భూమి, 19.86 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలిపారు. భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడంలో జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు, ఏపీఐఐసి అధికారులు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమన్నారు. ఇప్పటికే 55.24 ఎకరాల భూమికి సంబంధించి రూ.13.95 కోట్ల ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని విడుదల చేసి లబ్ధిదారులకు అందజేసినట్లు వెల్లడించారు. రైతులు, భూస్వాముల సహకారంతో ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "ఎం ఎస్ ఎం ఈ గ్రోత్ సమ్మిట్ 2026" ద్వారా పారిశ్రామిక రంగానికి మరింత బలాన్ని అందిస్తోందన్నారు. డిజిటల్ అసెస్‌మెంట్లు, ఎగుమతి అవకాశాలు, బ్యాంకింగ్ సపోర్ట్, స్టార్టప్ గుర్తింపులు వంటి కార్యక్రమాలు యువ పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల యువత కూడా పరిశ్రమల రంగంలో ముందుకు రావాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.శింగనమల నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏపీ తీరానికి కొత్త రూపు..

## సమగ్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు విజన్ ప్లాన్

**ఏపీ తీరప్రాంత అభివృద్ధికి విజన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశం**

**కోస్తా తీరాన్ని ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా మార్చాలని సూచన**

**తీరప్రాంత కోతను అరికట్టేందుకు సహజ రక్షణ కవచం ఏర్పాటు**

**ఆక్వాకల్చర్‌లో వాల్యూ అడిషన్, వ్యర్థాల నిర్వహణపై దృష్టి పెట్టాలని నిర్దేశం**

**బ్లూ ఎకానమీ, రేర్ ఎర్త్ మినరల్స్ వినియోగంపై అధ్యయనం చేయాలని స్పష్టం**



**మే 25 (రిపబ్లిక్ న్యూస్):**

ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి, ఆర్థిక కార్యకలాపాలకు కీలక కేంద్రంగా మార్చేందుకు ఒక 'విజన్ ప్లాన్' సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని సముద్ర సంపదను అందిపుచ్చుకుంటూనే, తీర ప్రాంతాన్ని పర్యావరణ హితంగా తీర్చిదిద్దాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో సముద్రతీర అభివృద్ధిపై నిపుణులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా 'బ్లూ ఎకానమీ' లేదా సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థపై చర్చ జరుగుతోందని, సముద్ర గర్భంలోని అపారమైన వనరులను వెలికితీయడం ద్వారా విస్తృత ప్రయోజనాలు పొందవచ్చని అన్నారు. ఏపీలో ఇప్పటికే ఆక్వాకల్చర్‌ను గణనీయంగా అభివృద్ధి చేశామని, రొయ్యలు, చేపల సాగు, ఎగుమతుల్లో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని గుర్తుచేశారు. అయితే, కేవలం ఉత్పత్తికే పరిమితం కాకుండా ఆక్వా ఉత్పత్తుల్లో వాల్యూ అడిషన్ (విలువ జోడింపు) జరగాలని, తద్వారా రైతులకు, రాష్ట్రానికి మరింత ఆదాయం వస్తుందని నిర్దేశించారు. అదే సమయంలో ఆక్వా వ్యర్థాలు పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయని, ఈ సవాళ్లను అధిగమించేందుకు పూర్తిస్థాయి అధ్యయనం జరగాలని సూచించారు.

తీరప్రాంత అభివృద్ధిలో భాగంగా మెరైన్ బయోడైవర్సిటీని (సముద్ర జీవ వైవిధ్యం) కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సీఎం స్పష్టం చేశారు. సముద్రాలతో పాటు తీరప్రాంతాల్లో లభించే రేర్ ఎర్త్ మినరల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించి, ఆ వనరులను అందిపుచ్చుకోవాలని అన్నారు. తుపాన్ల వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి తీరప్రాంతాన్ని రక్షించుకోవడం అత్యంత ముఖ్యమని, దీనికోసం మడ అడవులు, తాటి చెట్ల పెంపకం వంటి మూడంచెల సహజ రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

తీరప్రాంతాలను పర్యావరణ అనుకూల పర్యాటక కేంద్రాలుగా, ఆర్థిక కార్యకలాపాలకు చిరునామాగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సీ వీడ్ (సముద్రపు పాచి) సాగు, దాని మార్కెటింగ్ అవకాశాలను కూడా పరిశీలించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మత్స్యకారులకు కలిగే ప్రయోజనాలపై పూర్తి స్థాయి అధ్యయనం నిర్వహించి, పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు రావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ నాయక్, రైతు సాధికార సంస్థ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్, మెరైన్ డైవర్సిటీ సంస్థ వోయసీ ప్రతినిధి ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

# యాళ్లూరులో రూ.16.40 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్క్‌కు శంకుస్థాపన

## చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**"ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త" లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు**

**గ్రామీణ యువతకు ఉపాధి, స్వయం ఉపాధికి ఎంఎస్ఎంఈ పార్క్‌లు దిక్సూచి**

**యాల్లూరులో 37 పారిశ్రామిక ప్లాట్ల అభివృద్ధికి చర్యలు**

**పరిశ్రమల అభివృద్ధితోనే జిల్లా జీడీపీ వృద్ధి సాధ్యం**









**నంద్యాల జిల్లాలో అభివృద్ధి చెందుతున్న ఎంఎస్ఎంఈ పార్కులు:**

**నంద్యాల బ్యూరో, మే 25 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 175 ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. సోమవారం గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామంలో రూ.16.40 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన ఎంఎస్ఎంఈ పార్కుకు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 175 ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. "ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్" కార్యక్రమంలో భాగంగా, "ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త" అనే సంకల్పంతో గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేస్తోందని మంత్రి తెలిపారు. స్థానిక యువతకు స్వగ్రామాల పరిసరాల్లోనే ఉపాధి అవకాశాలు కల్పించడం, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పార్క్‌కు అవసరమైన అన్ని మౌలిక వసతులను వేగవంతంగా పూర్తి చేసి, పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ప్లాట్లను సిద్ధం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ పార్క్ ద్వారా గోస్పాడు మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక వాతావరణం ఏర్పడి, స్థానిక ఆర్థికాభివృద్ధికి ఊతం లభిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, " ఒక ఫ్యామిలీ ఒక పారిశ్రామికవేత్త "

లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం అందించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆదాయ అవకాశాలు పెంపొందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. యాళ్లూరులో 9 ఎకరాల భూమిలో ఏపీ ఐఐసి ఆధ్వర్యంలో పార్క్‌ను అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులతో పాటు పరిశ్రమల స్థాపనకు అనువైన సమగ్ర వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. సుమారు రూ.16.40 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్న ఈ పార్క్‌లో 37 పారిశ్రామిక ప్లాట్లు అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే జిల్లాలో డోన్, నందికొట్కూరు, బనగానపల్లి, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు అభివృద్ధి దశలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. నంద్యాల జిల్లా ఆదాయంలో 42 శాతం వ్యవసాయ రంగం ద్వారా, మరో 40 శాతం సేవారంగం ద్వారా లభిస్తోందని పేర్కొన్నారు. అయితే పరిశ్రమల రంగం ద్వారా కేవలం 19 శాతం మాత్రమే ఆదాయం వస్తోందని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధి ద్వారానే జిల్లా జీడీపీ పెరిగి రాష్ట్రంలో ముందంజలో నిలిచే అవకాశం ఉంటుందని వివరించారు. అరటి, చిరుధాన్యాలు, పత్తి, మిర్చి వంటి పంటలు అధికంగా పండే ఈ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఎంఎస్ఎంఈ పార్క్ రైతులు, యువత, స్థానిక పారిశ్రామికవేత్తలకు ఎంతో మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నందికొట్కూరు నియోజకవర్గం: తంగడంచ గ్రామం - 50 ఎకరాలు (241 ప్లాట్లు)
డోన్ నియోజకవర్గం: జగదుర్తి గ్రామం - 36.09 ఎకరాలు (38 ప్లాట్లు)
బనగానపల్లె నియోజకవర్గం: ఇటిక్యాల గ్రామం - 59.97 ఎకరాలు (266 ప్లాట్లు, ఇప్పటికే 23 కేటాయింపులు)
ఆళ్లగడ్డ నియోజకవర్గం: ఆర్.కృష్ణాపురం గ్రామం - 44.04 ఎకరాలు (228 ప్లాట్లు) అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత ఎంఎస్ఎంఈ పార్కుల స్థలాలను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ విశ్వనాథ్, యాళ్లూరు సొసైటీ చైర్మన్ గంగు వెంకటరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మధుసూదన్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చుక్కల భూములు, 22ఏ సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు

## ప్రజల భూ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం : జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి





**నంద్యాల బ్యూరో, మే 25 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో చుక్కల భూములు, 22ఏ నిషేధిత జాబితాకు సంబంధించిన సమస్యలను పారదర్శకంగా, చట్టబద్ధంగా మరియు వేగవంతంగా పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం 16 మందికి ల్యాండ్ ప్రొసీడింగ్స్ పత్రాలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ గతంలో 22ఏ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తులలో మొదటి విడతలో 111 దరఖాస్తులను పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత భూ యజమానులను పిలిపించి, వారి ల్యాండ్ ప్రొసీడింగ్స్ ఆధారంగా వెబ్‌ల్యాండ్ రికార్డులను సరిచేసి, అవసరమైన చోట ప్రభుత్వ భూమిగా నమోదైన వివరాలను పట్టా భూములుగా క్రమబద్ధీకరించి, 22ఏ నిషేధిత జాబితా నుండి తొలగించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రెండో విడతలో 56 దరఖాస్తులను పరిష్కరించి, మొదటి విడతలో అనుసరించిన విధానాన్నే అమలు చేస్తూ సంబంధిత రికార్డులను పూర్తిగా నవీకరించినట్లు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం, ఆర్డీఓ, తహసిల్దార్ వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో మార్పులు పూర్తి చేసి, జిల్లా రిజిస్ట్రార్‌కు సమాచారాన్ని పంపించి 22ఏ జాబితా నుండి తొలగింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. చుక్కల భూముల సమస్యలపై మాట్లాడుతూ, 22ఏ జాబితాలో ఉన్న భూమి ప్రభుత్వ భూమి కాదని, రహదారి లేదా పోరంబోకు కాదని నిర్ధారణ అయిన తర్వాతే నిషేధిత జాబితా నుండి తొలగింపు చేపడతామని కలెక్టర్ తెలిపారు. 2017 చుక్కల భూముల చట్టం ప్రకారం, సంబంధిత భూమి 2005 సంవత్సరం నుంచే దరఖాస్తుదారుడి ఆధీనంలో ఉన్నట్లు నిరూపించాల్సి ఉంటుందని, ఇందుకు తప్పనిసరిగా దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా భూ రికార్డుల చరిత్రను వివరిస్తూ, బ్రిటిష్ కాలంలో 1927లో రూపొందించిన సెటిల్‌మెంట్ రిజిస్టర్‌లో అనేక పట్టా భూములు పొరపాటున "జీడీ" గా నమోదు చేయబడి పక్కన చుక్కలు పెట్టబడినట్లు తెలిపారు. అయితే "జీపీ" గా నమోదైన భూములు మాత్రం ఖచ్చితంగా ప్రభుత్వ భూములేనని వివరించారు. దరఖాస్తుల పరిశీలన కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ పనిచేస్తోందని, ఈ కమిటీలో జాయింట్ కలెక్టర్, సంబంధిత ఆర్డీఓ, తహసిల్దార్, ఏడీ సర్వే మరియు జిల్లా రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారని కలెక్టర్ తెలిపారు. 2017 చట్టానికి ముందు 12 సంవత్సరాలపాటు భూమి ఆధీనంపై ట్రాన్సాక్షన్లు, లింక్ డాక్యుమెంట్లు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం మాత్రమే ప్రొసీడింగ్స్ జారీ చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం మరో 16 దరఖాస్తులను క్లియర్ చేసి ల్యాండ్ ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. గతంలో 111 మరియు 56 దరఖాస్తులను వేగంగా పరిష్కరించినట్లే, ప్రస్తుత దరఖాస్తులను కూడా రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి ఎక్కువగా కుటుంబ ఆస్తి వివాదాలు, అన్నదమ్ముల మధ్య భూ పంపకాల సమస్యలు వస్తున్నాయని, ఇటువంటి సివిల్ వ్యవహారాల్లో రెవెన్యూ లేదా పోలీసు అధికారులు జోక్యం చేసుకోరాదని చట్టం స్పష్టం చేస్తోందన్నారు. భూ వివాదాల పరిష్కారానికి కుటుంబ సభ్యులు పరస్పర అవగాహనతో ముందుకు రావాలని, అవసరమైతే సివిల్ కోర్టును ఆశ్రయించాలని సూచించారు. ఇటీవల జరిగిన విచారణలో మూడు ఉమ్మడి కుటుంబాలకు చెందిన కేసులు వచ్చాయని, కుటుంబ సభ్యులంతా కలిసి ఆస్తిని ఒకరి పేరు మీద నమోదు చేయాలని కోరడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని, జిల్లాలో ఇలాంటి సామరస్య వాతావరణం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చాగలమర్రి మండలం చక్రవర్తులపల్లె గ్రామానికి చెందిన జేసీ కే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తమ డాటెడ్ ల్యాండ్ సమస్య పరిష్కారానికి గతంలో ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ, జిల్లా అధికారుల ప్రత్యేక చొరవతో త్వరితగతిన క్రమబద్ధీకరణ పూర్తయిందని తెలిపారు. కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, వీఆర్ఓలకు సభాముఖంగా కృతజ్ఞతలు తెలిపారు

# ప్రజలకు చేరువవుతున్న ఆయుష్ వైద్య సేవలు

**జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాలతో ప్రతి సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరాలు**




**నంద్యాల బ్యూరో, మే 25 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో ప్రజలకు సంప్రదాయ వైద్య సేవలను మరింత చేరువ చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నంద్యాల పీజీఆర్ఎస్ కేంద్రంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయుష్ వైద్య అధికారి యశోధర తెలిపారు. ఆయుష్ డైరెక్టర్, విజయవాడ వారి సూచనల మేరకు ఆయుర్వేదం, హోమియోపతి, యునాని వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి, సైడ్ ఎఫెక్ట్స్ లేని సంప్రదాయ వైద్య విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా నొప్పులు, ఆయాసం, అజీర్ణం, జ్వరం, మలబద్ధకం, జలుబు, దగ్గు, కిడ్నీలో రాళ్లు వంటి అనేక సాధారణ మరియు దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. అలాగే మహిళలకు సంబంధించిన హార్మోన్ అసమానతలు, పీసీఓఎస్, అధిక రక్తస్రావం, మధుమేహ సంబంధిత సమస్యలు, నరాల బలహీనత, తిమ్మిర్లు, సయాటికా, స్పాండిలైటిస్, కీళ్ల వాతం వంటి వ్యాధులకు కూడా ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. పంచకర్మ చికిత్సలను జీజీహెచ్ (++ఎ) క్యాంపస్‌లోని ఆయుష్ విభాగంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో కూడా ఆయుష్ వైద్య శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కేంద్రంలో నిర్వహిస్తున్న ఈ వైద్య సేవలను సుమారు 150 మంది వరకు రోగులు వినియోగించుకుంటున్నారని ఆయుష్ అధికారి తెలిపారు. ప్రజలు ఈ ఉచిత ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

**అర్జీల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**జిల్లాలో రీఓపెన్ శాతాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి**

**పీజీఆర్ఎస్‌కు 309 దరఖాస్తుల స్వీకరణ**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





**నంద్యాల బ్యూరో, మే 25 (రిపబ్లిక్ న్యూస్):** ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, ఆర్డీఓలు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను చివరి నిమిషం వరకు పెండింగ్‌లో ఉంచకుండా, ఎప్పటికప్పుడు పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని సూచించారు. చివరి సమయంలో అర్జీల పరిష్కారం చేపట్టడం వల్ల నాణ్యత తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. అందువల్ల జిల్లాధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి సమర్థవంతమైన పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలో అర్జీలను పరిష్కరించిన శాఖల అధికారులను కలెక్టర్ వివరణ కోరారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 61,530 అర్జీలు స్వీకరించగా, అందులో 4,214 అర్జీలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంకా పరిశీలించని 128 అర్జీలను వెంటనే ఓపెన్ చేసి పరిశీలించాలని ఆదేశించారు. రీఓపెన్ అర్జీల విషయానికొస్తే మొత్తం 5,310 అర్జీలు రీఓపెన్ కాగా, అందులో 5,113 అర్జీలను పరిష్కరించారని, ఇంకా 197 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని వారం రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో రీఓపెన్ శాతం 9.26 శాతంగా ఉందని, దాన్ని 5 శాతానికి తగ్గించేలా కృషి చేయాలని సూచించారు. ఖప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా అర్జీదారులతో సంబంధిత శాఖ అధికారులు చరవాణి ద్వారా మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించినప్పటికీ, విద్యుత్ శాఖ, పౌర సరఫరాల శాఖ, మున్సిపల్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, సెర్ప్, టిడ్కో, దేవాదాయ శాఖ, అటవీ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ తదితర శాఖలు ఇప్పటివరకు నివేదికలు సమర్పించలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే అవసరమైన చర్యలు తీసుకుని నివేదికలు అందజేయాలని ఆదేశించారు. "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు ఆళ్లగడ్డలో రెండు విడతలుగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి విడతలో 578 దరఖాస్తులు, రెండవ విడతలో 561 దరఖాస్తులు స్వీకరించామని, వాటిని నాణ్యతతో పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 153 అర్జీల స్వీకరణ**

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ క్లినిక్స్ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పరిష్కరించే అవకాశం కలుగుతోందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 153 దరఖాస్తులు స్వీకరించగా, అందులో రెవెన్యూ మరియు గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 5, అడంగల్ సవరణలకు సంబంధించినవి 18, చుక్కల భూముల క్రమబద్ధీకరణ మరియు 22-ఎ భూములకు సంబంధించినవి 39, అసైన్డ్ భూములు మరియు భూ ఆక్రమణలకు సంబంధించినవి 27, రెవెన్యూ కోర్టు విచారణలు మరియు ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 28, సర్వే మరియు రీ-సర్వేలకు సంబంధించినవి 30, దేవాదాయ మరియు వక్ఫ్ భూములకు సంబంధించినవి 6 దరఖాస్తులు ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

**పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన సమస్యలు**

1)బనగానపల్లె మండలం తమ్మడపల్లికి చెందిన ఎ. రంగన్న తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.
2)దొర్నిపాడు మండలం చాకరాజువేముల గ్రామానికి చెందిన ఎ. జమాలమ్మ తాను సాగు చేసిన జొన్న పంటను మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు.
3)బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామానికి చెందిన ఎం. పెద్ద సుబ్బారాయుడు తన అత్తకు చెందిన సర్వే నెం. 488లోని భూమిని ఇతరులు అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com